క్లుప్తంగా

శ్రీరామనవమి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న స్థానికులు

శంషాబాద్ రూరల్: మండలంలోని నర్కూడ శివారులో ఉన్న అమ్మపల్లి (శ్రీసీతారామచంద్ర స్వామి) ఆలయంలో జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలకు రావాలని స్థానికులు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను ఆహ్వానించారు. శనివారం వారు ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు సర్పంచ్ సిద్దులు, సొసైటీ చైర్మన్ బి.సతీష్, నాయకులు బూర్కుంట గోపాల్, నీరటిరాజు, అశోక్, శ్రీనివాస్, రక్షిత్‌గౌడ్ పాల్గొన్నారు.

తైబజార్ వేలం పాట పూర్తి



వేలం పాట నిర్వహిస్తున్న కమిషనర్

మణికొండ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీ పరిధిలోని వారాంత సంతల్లో తైబజార్ వసూలు చేసుకునేందుకు శనివారం వేలం పాట నిర్వహించినట్టు మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ తెలిపారు. వేలం పాటలో మొత్తం 34 మంది పాల్గొనగా, అందులో ఎండీ జాహంగీర్ అత్యధికంగా రూ.20.50 లక్షలకు వేలం పాటను దక్కించుకున్నారన్నారు. వీరు ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే సంవత్సరం మార్చి 31వ తేదీ వరకు తైబజార్ వసూలు చేసుకుంటారని వివరించారు.

'అంగడి' పోలీస్ సబ్సిడీ క్యాంటీన్ ప్రారంభం

రాయదుర్గం: 'అంగడి' పోలీసు క్యాంటిన్ ఒక మినీ సూపర్ మార్కెట్ అని తెలంగాణ రాష్ట్ర హోంశాఖా ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ ప్రాంగణంలో పునరుద్దరించిన 'అంగడి' పోలీస్ సబ్సిడీ క్యాంటిన్‌ను శనివారం ఆయన సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, సాయింట్ సీపీ అవినాష్ మహంతితో కలిసి ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ పోలీసుల సౌకర్యార్థం అంగడి పోలీసు సబ్సిడీ క్యాంటిన్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోలీసు సిబ్బంది కుటుంబ అవసరాల నిమిత్తం నిత్యావసరవస్తువులు, ఆహారపదార్థాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు వంటివి 25 నుంచి 30 శాతం మేర సబ్సిడీకి లభిస్తాయన్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, డీసీపీలు కల్మేశ్వర్, యోగేష్ గౌతమ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఆంగ్ల విభాగంలో-2, కంప్యూటర్‌లో 2 పోస్టులకు గాను తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ తెలిపారు. ఈనెల 27న ఉదయం 11 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

సందడిగా స్నాతకోత్సవం

విజయనగర్‌కాలనీ: విద్యార్థులు క్రమశిక్షణ, పెద్దలపట్ల గౌరవంతో మెలగాలని నిజాం కళాశాల గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రేణుకా అన్నారు. శనివారం విజయనగర్‌కాలనీ రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పట్టాలు, మెడల్స్ అందజేసిన అనంతరం మాట్లాడారు. రవీంద్రభారతి విద్యా సంస్థల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియామనీష్, పాఠశాల ప్రిన్సిపాల్ నూరీన్ ఫాతీమా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

అబిడ్స్: దళితుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గౌలిగూడలో ఈనెల 26న ప్రారంభించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మంత్రి తలసానిని ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దళితబంధు లాంటి పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే దళితులకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభు, మిత్రసేవక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి పొదుపు పాటిద్దాం



నీటి పొదుపు ర్యాలీని ప్రారంభిస్తున్న మహేంద్రనాయక్

జలమండలి డీజీఎం మహేందర్‌నాయక్

మణికొండ: ప్రపంచ వ్యాప్తంగా 75 శాతం నీరు, 25 శాతం భూమి ఉన్నా.. అందులో తాగేందుకు వినియోగించే నీరు కేవలం ఒక్క శాతం మాత్రమే ఉందని, దాన్ని ప్రతి ఒక్కరు పొదుపుగా వాడాలని జలమండలి మణికొండ డీజీఎం మహేందర్‌నాయక్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవ 2023 వారోత్సవాల సందర్భంగా సొసైటీ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఎన్‌జీఓ ప్రధాన కార్యదర్శి కె. జ్యోతి బాయి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం డీజీఎం మహేందర్‌నాయక్ మాట్లాడుతూ, మన రాష్ట్రంలో గోదావరి, కృష్ణా లాంటి నదులు ఉండటంతో దూరాభారాలకు ఓర్చి నీటిని తెస్తున్నారన్నారు. అలాంటి నీటిని ప్రతి ఒక్కరం అవసరం మేరకే వాడాలన్నారు. నీటిని దుబారా చేస్తే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున నీటి సమస్య వస్తుందన్నారు. బోర్ల ద్వారా భూమిలో నుంచి నీటిని తీసుకుంటున్నట్టుగానే ఇంకుడు గుంతల ద్వారా తిరిగి అంతే నీటిని భూమిలోకి పంపాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ స్వూర్తిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీకాంత్, గంగాధర్, కిరణ్, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



పాల్గొన్న కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్, విద్యార్థులు

నీటి పొదుపు అందరి బాధ్యత

రాజేంద్రనగర్: మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. హైదర్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీరు, పరిశుభ్ర సంక్షోభాన్ని పరిరక్షించడానికి మార్పును వేగవంతం చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి పౌరులని, నీటిని పొదుపులో వారి బాధ్యత ఎంతో ఉందన్నారు. నీటిని వృథా కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రావ్యరెడ్డి, బీజేపీ నాయకులు కాడె మల్లేష్, బీట్కూరి సిద్ధేశ్వర్, లైన్‌మెన్ అఖిలేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మంచి మార్గంలో నడవాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శ్రీలత

రాజేంద్రనగర్: తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వొద్దని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శ్రీలత సూచించారు. మధుబన్ కాలనీ చౌరస్తాలో శనివారం రాత్రి స్థానిక యువకులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో తిరుగుతున్నారు తదితర విషయాలను గమనించాలన్నారు. చెడు స్నేహాలు మంచివి కాదని పిల్లలకు తెలియజెప్పాలన్నారు. యువకులు అర్ధరాత్రి వరకు బస్తీలు, రోడ్లపై తిరగవద్దని అన్నారు. తమ ప్రాంతంలో ఎలాంటి అసంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా తమకు సమాచారం అందించాలన్నారు. మాదకద్రవ్యాలను ఎవరు సేవించినా, విక్రయించినా సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ శ్రీలత అన్నారు.

ఇంటింటా పోషణ సంబరాలు

రాయదుర్గం: అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఇంటింటా పోషణ కార్యక్రమం ప్రారంభమైంది. ఖాజాగూడలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి పర్యవేక్షణలో బాలింతలు, గర్భిణీ స్త్రీల ఇంటింటికి వెళ్ళి పరిశీలించారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 14 వరకు ఉంటుంది.

చెత్త పేరుకుపోవడంతో స్థానికుల ఆగ్రహం



రాయదుర్గం: నానక్‌రాంగూడలో చెత్తచెదారం పేరుకుపోయినా పట్టించుకునేనాథుడే కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నానక్‌రాంగూడలోని రేషన్‌షాపు గల్లీలోని అంతర్గతరోడ్డుపై చెత్తాచెదారం, వ్యర్థాలు భారీగా పేరుకపోతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు ఈ విషయంలో పట్టించుకోవాలని వారు అభిప్రాయపడుతున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గోల్కొండ: తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గోల్కొండ కోటపై కొలువుదీరిన జగదాంబిక మహంకాళి అమ్మవార్ల హుండీ ఆదాయం బాగా పెరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు అన్నారు. శనివారం కోటలోని ఆలయ ప్రాంగణంలో హుండీని లెక్కించారు. ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య బాగా పెరిగిందన్నారు. సాధారణ రోజుల్లో కూడా భక్తులు హుండీలో నగదు కానుకలు సమర్పించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌కుమార్, శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి, శివశంకర్, పూజారి సురేష్ చారి, శివ ఆదినారాయణ తదితరులున్నారు. కాగా రూ.మొత్తం ఈ లెక్కింపు ద్వారా రూ.68,750 లు ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



ముజీబ్‌హుస్సేన్‌ను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో టీఎన్‌జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్‌హుస్సేన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పలుగుచెరువు మహేష్ ఆధ్వర్యంలో ముజీబ్‌హుస్సేన్‌ను కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. జయంతి వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, క్రమశిక్షణతో సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి ఎం.శ్రీనివాస్, ఉపకోశాధికారి ఎడ్లకాడి సూర్యం, ముఖ్య సలహాదారులు అనుముల జాన్‌పాల్, నందిగామ నర్సింహ, ఉపాధ్యక్షుడు వీర్లపల్లి మహేష్, మడిగ మాధవులు, ప్రచార కార్యదర్శి అక్కిరాజు సుబ్బారావు, బర్ల సుమన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలి



ఫాహీమ్ ఖురిషిని సన్మానిస్తున్న నాయకులు

బండ్లగూడ: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ ఇన్‌చార్జిగా మొహమ్మద్ ఫాహీమ్ ఖురేషి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముంగి జైపాల్‌రెడ్డి, అశోక్‌యాదవ్, కృష్ణారెడ్డి, డి.నవీన్, ఖాలీద్, ధనంజయ్, శేఖర్‌యాదవ్, తాజుద్దీన్, ఇస్మాయిల్, జితేందర్, ఓంప్రకాష్‌రెడ్డి, యాదగిరి, కార్పొరేటర్లు శ్రీనాథ్‌రెడ్డి, సంగారెడ్డి, అద్నాన్‌సాధిక్, కౌన్సిలర్లు విజయ్‌బాబు, రాము, సురేష్, అంకం శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, కె.గణేష్, బోగల శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.

28 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్టు

మణికొండ: పుప్పాలగూడలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు అర్చకుడు చలమాచారి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు మంగళవారం ఉదయం స్వస్తివాచనం, నివేదన, సాయంత్రం అంకురార్పణ, లఘు హోమం, స్వామి వారికి నివేదనలు ఉంటాయన్నారు. 29వ తేదీ బుధవారం ఉదయం ధ్వజారోహణం, నిత్యహోమం, స్వామి వారికి అభిషేకం, సాయంత్రం నిత్యహోమం, మంటపారాధన ఉంటాయన్నారు. 30వ తేదీ గురువారం ఉదయం పూర్ణాహుతి, శ్రీ సీతారామ కల్యాణం, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, శివపార్వతుల కల్యాణం, శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతాయన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అర్చకులు కోరారు.

క్రీడలతో నూతనోత్సాహం

● తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ జితేందర్



రాయదుర్గం: క్రీడలతో నూతనోత్సాహం వెల్లివిరుస్తుందని తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం సాయంత్రం సైబరాబాద్ అయిదవ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2023 ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు కంటే పాల్గొనడం ఎంతో ముఖ్యమన్నారు. కష్టపడితేనే క్రీడల్లోనూ, ఏ వృత్తిలోనైనా ఫలితం ఉంటుందన్నారు. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ క్రీడలు నాయకత్వ లక్షణాలను తట్టిలేపడంలోపాటు టీమ్ స్పిరిట్ ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ అవినాష్‌మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్, పలువురు డీసీపీ, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

చెత్త సేకరణ కార్మికులకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచన



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: చెత్త సేకరణ ఆటో రిక్షా కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ పరిసరాల పరిశుభ్రతకు తమ వంతు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచన. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెత్త సేకరణ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. గత వారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు 20 నూతన చెత్త ఆటోలు కొనుగోలు చేసి కేటాయించారు. కొత్త వారికి కేటాయించడంతో గత కొన్ని సంవత్సరాలుగా చెత్త ఆటోలు నడుపుతున్న తాము ఇబ్బందులకు గురవుతున్నామని, కొత్త వారికి కాకుండా పాత చెత్త సేకరణ ఆటో కార్మికులకే ఆటోలకు కేటాయించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వెంటనే కార్పొరేషన్ కమిషనర్‌కు ఫోన్ చేసి చెత్త సేకరణ ఆటో రిక్షా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కొత్త వారికి కాకుండా పాతవారికే నూతనంగా కొనుగోలు చేసిన కొత్త ఆటోలను అందించాలని సూచించారు. దీంతో ఆటో రిక్షా కార్మికులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కార్మికులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతి రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తను తీసుకోవాలన్నారు. దానిని డైరెక్టుగా డంపింగ్‌కు తీసుకువెళ్లి డంప్ చేయాలన్నారు. ఓపెన్ పాయింట్లు, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను డంప్ చేయొద్దన్నారు. ఎవరైనా ఇంటి యజమానులు చెత్తను అందించకపోతే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలన్నారు.కార్యక్రమంలో చెత్త సేకరణ ఆటో రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు చేయాలి



విద్యార్థినులకు అవార్డులు అందజేస్తున్న చైర్‌పర్సన్ జ్యోతిదేవి

మణికొండ: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి నూతన ఆవిష్కరణ చేసేందుకు నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఐడియాథాన్ 2023 శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల చైర్‌పర్సన్ కె.జ్యోతిదేవి, వైస్ చైర్మన్ డాక్టర్ కె.రాధాకిషన్‌రావు, గౌరవ అతిథిగా స్మార్ట్ ఇంట్రెస్ట్ వ్యవస్థాపకుడు, సీఈఓ అమరేందర్‌లు మాట్లాడుతూ, ఇంజినీర్లు అనుక్షణం నూతన ఆవిష్కరణల గురించే ఆలోచించాలన్నారు. ప్రజలు తమ జీవనాన్ని సులువు చేసుకునేందుకు నూతన ఆవిష్కరణలకు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాంటి వారిని ఆకట్టుకునేందుకు ప్రపంచ వ్యాప్తంగా అనేక ఆవిష్కరణలు వస్తున్నాయన్నారు. వారికన్నా భిన్నంగా ఆలోచన చేసి మరిన్ని నూతన ఆవిష్కరణలను తీసుకురావాల్సిన బాధ్యత యువ ఇంజినీర్లపై ఉందన్నారు. అనంతరం ఐడియాథాన్ 2023లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు, కోఆర్డినేటర్లకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎల్ మల్లీశ్వరి, కోఆర్డినేటర్ డాక్టర్ నరేంద్రకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రి పదవికి కేటీఆర్ రాజీనామా చేయాలి

కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్



ధర్నాలో పాల్గొన్న కార్పొరేటర్ మోండ్ర సంగీతా

రాజేంద్రనగర్: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రం లీకేజీకి మంత్రి కేటీఆర్ బాధ్యత వహిస్తూ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ పిలుపు మేరకు నిర్వహించిన 'మా నౌకరీలు మాకు కావాలి' దీక్షకు కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బిటూకూరి సిద్ధేశ్వర్, కాడెం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో వ్యవసాయ ఉన్నత విద్యపై అవగాహన



మాట్లాడుతున్న ప్రణీత హేమంత్‌కుమార్

ఏజీవర్సిటీ: విదేశాలలో వ్యవసాయ శాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఉన్న అవకాశాలు, ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం సదస్సును నిర్వహించారు.అఖిల భారత వ్యవసాయ విద్యార్థుల సంఘం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు యునైటెడ్ స్టేట్స్ అగ్రికల్చరల్ యూనివర్సిటీస్ సహకారం అందించింది. విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదివేందుకు ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్‌ను ఏ విధంగా పొందవచ్చు, విదేశాల్లో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో చేసేందుకు కావాల్సిన అర్హతలు, ఎలా చదువుకోవాలని, అందుబాటులో ఉన్న ఫెలోషిప్‌ల గురించి పలువురు విద్యావేత్తలు, అధ్యాపకులు వివరించారు. సదస్సులో ముఖ్యఅతిథి ప్రణీత హేమంత్‌కుమార్, విశ్వవిద్యాలయం డీఎస్‌ఏ డాక్టర్ జె.సత్యనారాయణ, నరేంద్రరెడ్డి, అనిత, అఖిల భారత వ్యవసాయ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కె.అరవింద్, ప్రవీణ్‌కుమార్, ఎస్ వైష్ణవ్ పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు

సంక్షేమాభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శం

రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఎల్.రమణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి ఫలితంగా సంక్షేమం, అభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ ఎల్.రమణ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ గండిపేట మండల బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని జీఆర్‌కే గార్డెన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్.రమణ, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ, తెలంగాణలో 70 లక్షల మంది సభ్యత్వమున్న అతిపెద్ద పార్టీ బీఆర్‌ఎస్ అని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచీ ఇప్పటి వరకు ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రకాష్‌గౌడ్ వేల కోట్ల నిధులతో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీటి పైపులైన్ వంటి అభివృద్ధి పనులు చేయించారన్నారు. పిలిస్తే పలికే నాయకుడిగా పేరు తెచ్చుకొని ఏ సమస్య వచ్చినా వేగంగా స్పందించి పరిష్కరించడం వల్లే ఇక్కడి ప్రజలు ప్రకాష్‌గౌడ్‌ను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారని, వచ్చే ఎన్నికల్లో నాలుగోసారి కూడా ఆయన గెలుపు తథ్యమన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ, కార్యకర్తల సమష్టి కృషితోనే బీఆర్‌ఎస్ పార్టీ ఈ స్థాయిలో వృద్ధి చెందిందన్నారు. అందువల్లే కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలందరినీ సీఎం కేసీఆర్ కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నారన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు నర్సింహ్మ, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి, మణికొండ పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, కౌన్సిలర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.